# చాంపియన్స్‌కు 20 కోట్లు

- ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసీసీ



దుబాయ్: ఈనెల 19 నుంచి ప్రారంభం కాబోయే ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ఐసీసీ ప్రైజ్‌మనీని ప్రకటించింది. టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీని 6.9 యూఎస్ మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 60 కోట్లు)గా ప్రకటించిన ఐసీసీ.. ఫైనల్‌లో కప్పు గెలిచిన విజేతకు 2.24 యూఎస్ మిలియన్ డాలర్లు (రూ. 20.8 కోట్లు) అందించనుంది. గత ఎడిషన్‌తో పోలిస్తే ఇది 53 శాతం అధికం. ఇక రన్నరప్‌గా నిలిచే జట్టుకు 1.12 యూఎస్ మిలియన్ డాలర్లు (రూ. 9.72 కోట్లు) దక్కనున్నాయి. ఈ మేరకు ఐసీసీ చైర్మన్ జై షా శుక్రవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించాడు. సెమీస్‌లో ఓడిన జట్లకు రూ. 4.86 కోట్లు.. ఐదు, ఆరు స్థానాల్లో నిలిచే జట్లకు రూ. 3 కోట్లు దక్కుతాయి. 7,8 స్థానాల్లో నిలిచే జట్లకు తలా రూ. 1.2 కోట్లు అందుతాయి. దీంతో పాటు చాంపియన్స్ ట్రోఫీలో ప్రాతినిధ్యం వహించినందుకు గాను ఒక్కో జట్టుకు అదనంగా రూ. 1.08 కోట్ల నగదు బహుమానం దక్కుతుందని ఐసీసీ తెలిపింది. 1996 తర్వాత తొలిసారి ఐసీసీ ఈవెంట్‌కు ఆతిథ్యమివ్వనున్న పాకిస్థాన్.. ఈ టోర్నీని ఏ మేరకు విజయవంతంగా నిర్వహిస్తుందనేది క్రికెట్ ప్రపంచం ఆసక్తికరంగా ఎదురుచూస్తోంది.

# నేషనల్ గేమ్స్‌కు బై బై

**అట్టహాసంగా ముగింపు వేడుకలు**



హల్ద్వానీ: ఉత్తరాఖండ్ వేదికగా 38వ నేషనల్ గేమ్స్‌కు శుక్రవారం తెరపడింది. గత కొన్ని రోజులుగా క్రీడాభిమానులను అలరిస్తూ వస్తున్న నేషనల్ గేమ్స్ ముగింపు వేడుకలు అట్టహాసంగా ముగిశాయి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన వేడుకల్లో ఆయా రాష్ర్టాలకు చెందిన పతక విజేతలతో పాటు కోచ్‌లు, అధికారులు, అభిమానులు పాల్గొన్నారు. నేషనల్ గేమ్స్‌లో పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్(ఎస్ఎస్‌సీబీ) చాంపియన్‌షిప్(68 స్వర్ణాలు, 26 రజతాలు, 27 కాంస్యాలు) కైవసం చేసుకోగా, మహారాష్ట్ర, హర్యానా రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి. కర్నాటకకు చెందిన స్విమ్మర్లు శ్రీహరి నటరాజ్, దినిది దెసింగ్ బెస్ట్ ప్లేయర్లుగా నిలిచారు. 3 స్వర్ణాలు, 3 రజతాలు,12 కాంస్యాలతో తెలంగాణ 26వ స్థానంలో నిలిచింది.

# లలిత్‌మోదీ కొత్త ప్రేమాయణం..

- సుస్మితాసేన్‌తో బ్రేకప్



లండన్: ఐపీఎల్ ఫౌండర్, మాజీ చైర్మన్ లలిత్‌మోదీ మళ్లీ ప్రేమల్లో పడ్డాడు. లేటు వయసులో గాటు ప్రేమ అన్నట్లు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా తన కొత్త ప్రేమాయణాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నాడు. బాలీవుడ్ బ్యూటీ సుస్మితాసేన్‌కు బ్రేకప్ చెబుతూ కొత్త ప్రేయసితో కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలను షేర్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. తమ 25 ఏండ్ల స్నేహం ప్రేమగా మారిందంటూ రాసుకొచ్చిన మోదీ కొత్త ప్రేయసి పేరు మాత్రం వెల్లడించలేదు. 1991లో తొలిసారి మినాల్ మోదీని పెండ్లి చేసుకున్న లలిత్..2018లో ఆమె కన్నుమూయడంతో 2022 నుంచి సుస్మితాసేన్‌తో ప్రేమలో ఉన్నాడు. అయితే ఇటీవల సుస్మితాతో ఉన్న ఫొటోలను తన సోషల్‌మీడియా నుంచి తొలిగించిన 61 ఏండ్ల మోదీ కొత్త ప్రేమకు శ్రీకారం చుట్టాడు.

# రిచా వారెవ్వా

**ధనాధన్ అర్ధసెంచరీతో విజృంభణ**

**గుజరాత్‌పై ఆర్‌సీబీ థ్రిల్లింగ్ విక్టరీ**

**గార్డ్‌నర్ కెప్టెన్ ఇన్నింగ్స్ వృథా**

**డబ్ల్యూపీఎల్‌కు అదిరిపోయే ఆరంభం**




వడోదర: అమ్మాయిల ధనాధన్ పోరుకు అదిరిపోయే ఆరంభం. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్ మొదటి మ్యాచ్‌లోనే అభిమానులు బౌండరీలు, సిక్సర్ల వర్షంలో తడిసి ముద్దయ్యారు. డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), గుజరాత్ జెయింట్స్ మధ్య శుక్రవారం వడోదర వేదికగా జరిగిన హైస్కోరింగ్ థ్రిల్లర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. డబ్ల్యూపీఎల్ చరిత్రలోనే అత్యధిక ఛేదన (202)ను బెంగళూరు విజయవంతంగా పూర్తి చేసింది. గుజరాత్ సారథి ఆష్లే గార్డ్‌నర్ (37 బంతుల్లో 79 నాటౌట్, 3 ఫోర్లు, 8 సిక్సర్లు) బ్యాట్‌తో పాటు బంతి (2/33)తోనూ మాయ చేసినా జెయింట్స్‌కు పరాభవం తప్పలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్‌కు గార్డ్‌నర్‌తో పాటు బెత్ మూనీ (42 బంతుల్లో 56, 8 ఫోర్లు) రాణించడంతో ఆ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. భారీ ఛేదనలో ఆర్‌సీబీ.. రిచా ఘోష్ (27 బంతుల్లో 64 నాటౌట్, 7 ఫోర్లు, 4 సిక్సర్లు), ఎలీస్ పెర్రీ (34 బంతుల్లో 57, 6 ఫోర్లు, 2 సిక్సర్లు), కనిక అహుజా (13 బంతుల్లో 30 నాటౌట్, 4 ఫోర్లు) మెరుపులతో ఆ జట్టు 18.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఊదేసింది.

**పెర్రీ, రిచా మెరుపులు**

కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బెంగళూరుకు ఆరంభంలోనే డబుల్ షాక్ తగిలింది. బ్యాటింగ్‌లో దుమ్మురేపిన గార్డ్‌నర్.. రెండో ఓవర్‌లో బంతిని అందుకుని నాలుగు బంతుల వ్యవధిలో ఆర్‌సీబీ సారథి స్మృతి మంధాన (9), డేనియల్ వ్యాట్ (4)ను పెవిలియన్‌కు పంపింది. కానీ వన్‌డౌన్‌లో వచ్చిన పెర్రీ, రఘ్వీ (25) గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. యువ పేసర్ కశ్వి గౌతమ్, తనూజా కన్వర్ బౌలింగ్‌లో బౌండరీలతో విరుచుకుపడ్డారు. డాటిన్ వేసిన 11వ ఓవర్లో నాలుగో బంతిని డీప్ స్క్వేర్ లెగ్ దిశగా సిక్సర్ కొట్టిన పెర్రీ.. డబ్ల్యూపీఎల్‌లో ఐదో అర్ధ సెంచరీని నమోదుచేసింది. కానీ ఇదే ఓవర్లో ఆఖరి బంతికి రఘ్వీ.. సయాలికి క్యాచ్ ఇవ్వడంతో 86 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. పెర్రీ కూడా సయాలీ 13వ ఓవర్లో లాంగాన్ వద్ద లారాకి చిక్కింది. కానీ రిచా ఆర్‌సీబీ పోరాటాన్ని కొనసాగించింది. గార్డ్‌నర్ 16వ ఓవర్లో 4, 6, 4, 4, 4తో 23 పరుగులు పిండుకుంది. డాటిన్ 17వ ఓవర్లో కనిక రెండు బౌండరీలతో 16 పరుగులు రాబట్టడంతో బెంగళూరు లక్ష్యానికి చేరువైంది. 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన రిచా.. ప్రియా మిశ్రా 18వ ఓవర్లో రెండు బౌండరీలు, భారీ సిక్సర్‌తో బెంగళూరు విజయాన్ని ఖాయం చేసింది.

**మూనీ, గార్డ్‌నర్ దూకుడు**

గుజరాత్ ఇన్నింగ్స్‌లో మూనీ, గార్డ్‌నర్ ఆటే హైలైట్. ఆరంభంలో నెమ్మదిగానే ఆడిన మూనీ.. క్రీజులో కుదురుకున్నాక విజృంభించింది. మరో ఓపెనర్ లారా (6), హేమలత (4) విఫలమైనప్పటికీ.. ఆస్ట్రేలియా ద్వయం ఆర్సీబీ బౌలర్లపై బౌండరీలు, సిక్సర్లతో రెచ్చిపోయింది. మొదటి టైమ్ ఔట్ సమయానికి 9 ఓవర్లలో గుజరాత్ చేసింది 53/2 పరుగులే. కానీ ఆ తర్వాత మూనీ, గార్డ్‌నర్ గేర్ మార్చారు. వర్హెమ్ 10వ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్ కొట్టిన మూనీ 37 బంతుల్లో అర్ధ సెంచరీ నమోదుచేసింది. కనిక బౌలింగ్‌లో లాంగాన్ మీదుగా సిక్సర్ బాదిన గార్డ్‌నర్.. ఇన్నింగ్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. మూనీ నిష్క్రమించినా డాటిన్ (13 బంతుల్లో 25, 3 ఫోర్లు, 1 సిక్స్) అండతో రెచ్చిపోయి ఆడింది. ప్రేమ రావత్ 14వ ఓవర్లో ఆమె హ్యాట్రిక్ సిక్సర్లు కొట్టగా వర్హెమ్ 15వ ఓవర్లో డాటిన్ మూడు బౌండరీలు బాదింది. 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తిచేసిన గార్డ్‌నర్.. జోషిత 18వ ఓవర్లో మరో మూడు సిక్సర్లు కొట్టడంతో గుజరాత్ స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. అజేయంగా నిలిచిన గార్డ్‌నర్ ఏకంగా 8 సిక్సర్లు బాదడం విశేషం.

**1** డబ్ల్యూపీఎల్‌లో ఇదే అత్యధిక ఛేదన. గత ఎడిషన్‌లో ముంబై.. గుజరాత్‌పై 191 పరుగులను ఛేదించడమే ఇప్పటి దాకా అత్యుత్తమం.

**సంక్షిప్త స్కోర్లు:**
**గుజరాత్:** 20 ఓవర్లలో 201/5 (గార్డ్‌నర్ 79 నాటౌట్, మూనీ 56, రేణుకా 2/25, అహుజా 1/19); **బెంగళూరు:** 18.3 ఓవర్లలో 202/4 (రిచా 64 నాటౌట్, పెర్రీ 57, గార్డ్‌నర్ 2/33, డాటిన్ 1/41)

# 27 బ్యాగులు.. 250 కిలోలు

- ఆస్ట్రేలియా నుంచి భారీ లగేజీ తెచ్చిన భారత క్రికెటర్!

ముంబై: కొద్దిరోజుల క్రితమే ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత జట్టులో ఉన్న ఓ కీలక ఆటగాడు బీసీసీఐ నిబంధనలను తుంగలో తొక్కి భారీ లగేజీని స్వదేశానికి తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. కొత్త నిబంధనల ప్రకారం విదేశీ పర్యటనకు వెళ్లే ఒక ఆటగాడు.. 150 కిలోల వరకు (ఆ తర్వాత బీసీసీఐ చెల్లించదు) మాత్రమే లగేజీని తెచ్చుకునే అవకాశముంది. కానీ సదరు క్రికెటర్ మాత్రం ఏకంగా 27 బ్యాగుల్లో 250 కిలోల లగేజీని తెచ్చినట్టు ప్రముఖ హిందీ పత్రిక ఓ కథనంలో పేర్కొంది. బ్యాగుల్లో 17 బ్యాట్లు, ఆ ఆటగాడి కుటుంబం, వ్యక్తిగత సిబ్బంది కోసం కొనుగోలు చేసిన విలువైన వస్తువులున్నట్టు తెలుస్తోంది. బోర్డుతో తనకున్న పరిచయాలతో అతడు లగేజీ బిల్ మొత్తం బీసీసీఐ ఖాతాలోనే వేసినట్టు సమాచారం. అయితే ఆ క్రికెటర్ ఎవరు? అనేది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా మారింది.

# కోహ్లీని అధిగమించిన బాబర్ ఆజమ్

కరాచీ: వన్డేలలో అత్యంత వేగంగా 6వేల పరుగులు పూర్తిచేసిన క్రికెటర్లలో పాకిస్థాన్ మాజీ సారథి బాబర్ ఆజమ్.. భారత దిగ్గజం విరాట్ కోహ్లీని అధిగమించాడు. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు ఈ ఘనతను అందుకున్నాడు. బాబర్‌కు వన్డేలలో ఇది 123వ ఇన్నింగ్స్. కోహ్లీ 136 ఇన్నింగ్స్‌లలో ఈ రికార్డు సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ హషీమ్ ఆమ్లా (123 ఇన్నింగ్స్)తో సమానంగా బాబర్ నిలిచాడు.

# ఆస్ట్రేలియాకు షాక్

**శ్రీలంక చేతిలో వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్**

కొలంబో: చాంపియన్స్ ట్రోఫీ ముందు అగ్రశ్రేణి ఆస్ట్రేలియాకు ఊహించని షాక్ తగిలింది. గాయాలతో కీలక ఆటగాళ్లు దూరమైన ఆ జట్టుకు శ్రీలంక ఝలక్ ఇచ్చింది. వరుసగా రెండు మ్యాచ్‌లలోనూ గెలిచి సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. కొలంబో వేదికగా శుక్రవారం జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా ఏకంగా 174 పరుగుల తేడాతో ఓడింది. ఆసియా గడ్డపై కంగారూలకు పరుగుల పరంగా ఇదే అతిపెద్ద (ఓవరాల్‌గా ఐదోది) పరాభవం. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ కుశాల్ మెండిస్ (101) సెంచరీతో కదం తొక్కగా కెప్టెన్ చరిత్ అసలంక (78) మరోసారి మెరిశాడు. నిషాన్ (51) కూడా రాణించాడు. లక్ష్య ఛేదనలో ఆసీస్ 24.2 ఓవర్లలో 107 పరుగులకే కుప్పకూలింది. స్టీవ్ స్మిత్ (29) టాప్ స్కోరర్ కాగా మరో ఇద్దరు బ్యాటర్లు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. లంక బౌలర్లలో దునిత్ వెల్లలగె (4/35), వనిందు హసరంగ (3/23), అసిత ఫెర్నాండో (3/23) కంగారూలను కట్టడి చేశారు.




# కివీస్‌దే ముక్కోణపు సిరీస్

**ఫైనల్‌లో పాక్ ఓటమి**



కరాచీ: స్వదేశంలో చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఆతిథ్య పాకిస్థాన్ భారీ షాక్ తగిలింది. న్యూజిలాండ్‌తో జరిగిన ముక్కోణపు సిరీస్ ఫైనల్‌లో పాక్.. 5 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పాక్.. 49.3 ఓవర్లలో 242 పరుగులకే ఆలౌట్ అయింది. కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ (46), సల్మాన్ అగా (45), తయ్యబ్ తాహిర్ (38) పాక్‌ను ఆదుకున్నారు. కివీస్ బౌలర్లలో విలియమ్ ఒరూర్కి (4/43), కెప్టెన్ శాంట్నర్ (2/20) పాక్ బ్యాటర్లను కట్టడిచేశారు. ఛేదనలో కివీస్.. 45.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. డారిల్ మిచెల్ (57), టామ్ లాథమ్ (56) అర్ధ సెంచరీలతో రాణించి కివీస్‌కు ట్రోఫీని అందించడంలో కీలకపాత్ర పోషించారు.

